## బ్రీత్ టెస్ట్‌లతో డ్రైవర్ల తొలగింపు ఆపాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్‌లకు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌ల పేరుతో ఉద్యోగాల తొలగింపును ఆపాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ జాక్ ప్రతినిధులు శుక్రవారం బస్‌భవన్‌లో ఎండీ సజ్జనార్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చారు. బ్రీత్ అనలైజర్ టెస్ట్‌లో రీడింగ్ చూపినప్పుడు ఆ డ్రైవర్ కోరితే రైల్వేశాఖలో మాదిరిగా మరొక బ్రీత్ ఎనలైజర్‌తో టెస్ట్ చేయించాలని, లేదా రక్త పరీక్ష ద్వారా నిర్ధారించాలని కోరారు. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో కన్వీనర్ సురేష్, జేఏసీ నాయకులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సాగు భూములకే రైతుభరోసా

మొదటిపేజీ తరువాయి...

పది ఎకరాల వరకే పెట్టుబడి సాయం నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. గత డిసెంబర్‌లో తమ ప్రభుత్వం వచ్చాక రైతుబంధు నిధులు జమ చేసినట్టు తెలిపారు. అధికారంలోకి రాగానే రైతుబంధు మార్పులకు అవకాశం దొరకలేదని అన్నారు. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందినట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రూ.2 లక్షల్లోపు ఉన్న 22 లక్షల మంది కర్షకులకు రుణమాఫీ అమలు చేశామని అన్నారు. తెల్లరేషన్ కార్డు లేని రైతులకు సైతం ఈనెలాఖరులోగా రుణమాఫీ నిధులు జమ చేస్తామని చెప్పారు. రూ.2 లక్షలకుపైగా రుణం తీసుకున్న రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో రూ.2 లక్షలకుపైనున్న లోన్ డబ్బు చెల్లిస్తే మాఫీ వర్తింపజేస్తామని స్పష్టంచేశారు. రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని, అందరికీ వందశాతం మాఫీ చేసి తీరుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## తన్నుకున్న అటవీ అధికారులు

సుబేదారి, సెప్టెంబర్ 13 : హనుమకొండ సుబేదారిలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఇద్దరు అధికారులు సిబ్బంది ముందే తన్నుకున్నారు. వారం రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జిలాల్లోని అటవీశాఖలో పనిచేస్తున్న రేంజ్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మధ్య డ్యూటీ విషయంలో గొడవలు జరుగుతున్నా యి.

# దళిత కాలనీలకు కరెంట్ కట్

- మీటర్ తీసుకోవడం లేదంటూ విద్యుత్తు అధికారుల చర్యలు
- ప్రభుత్వ తీరుపై దళితుల ఆగ్రహం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని దళిత కాలనీ

రేగొండ, సెప్టెంబర్ 13 : విద్యుత్తు అధికారులు గురువారం రాత్రి నుంచి దళిత కాలనీలకు కరెంట్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆయా కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో చోటుచేసుకుంది. భూపాలపల్లి ఏడీ, రేగొండ ఏఈ తమ సిబ్బందితో రేగొండ, గోరికొత్తపల్లి మండల కేంద్రాలతో పాటు పెద్దంపల్లి, నారాయణపురం, జగ్గయ్యపేట, నిజాంపల్లితోపాటు పలు గ్రామాల్లోని దళిత కాలనీలకు విద్యుత్తు సరఫరా చేసే వైర్లను తొలగించారు. దీంతో రాత్రంతా కరెంట్ లేకపోవడంతో దోమల బెడదతో నిద్ర కరువైంది దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్తు పథకం అమలు కావాలంటే ప్రతి ఒక్కరూ మీటర్ తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సరఫరా నిలిపివేస్తున్నారు. ఓ పక్క దళితులకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నట్టు ప్రకటిస్తూనే మరోపక్క అధికారుల చేత దాడులు చేయిస్తున్న ప్రభుత్వం తీరుపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ మీటర్ ఉంటేనే గృహజ్యోతి వర్తిస్తుందని ఏఈ కనకయ్య తెలిపారు. వారం రోజులుగా అవగాహన కల్పించినా ఎవరూ స్పందించడం లేదని పేర్కొన్నారు. అందువల్లే కరెంట్ సరఫరాను నిలిపివేసినట్టు ఆయన పేర్కొన్నారు.

### ప్రజాపాలన అన్నరు.. పరేషాన్ చేస్తున్నరు



ప్రజాపాలన తెస్తామన్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు అందరినీ వివిధ కారణాలతో పరేషాన్ చేస్తున్నరు. పదేండ్ల నుంచి కేసీఆర్ సర్కారు ఏనాడూ మా కాలనీలకు వచ్చి కరెంట్ కట్ చేయలేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరెంట్ మీటర్ తీసుకోవాలని అధికారులు వేధింపులకు గురిచేస్తున్నరు. డబ్బులు లేక చెల్లించకపోవడంతో మా కాలనీకి కరెంట్ కట్ చేసి మమ్మల్ని అంధకారంలోకి నెట్టారు. కరెంట్ లేక పిల్లలు చదువుకుంటలేరు. దోమల బెడద, ఉక్కపోతతో నరకయాతన అనుభవిస్తున్నాం.

– గజ్జెల రామకృష్ణ, రేగొండ

## ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్‌గా దళితుడు అర్హుడు కాదా?

**మాదిగలను మరోసారి మోసం చేస్తున్న కాంగ్రెస్: ఎర్రోళ్ల ధ్వజం**



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగజాతిని కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధ్యయనం చేసి సిఫారసులు చేయడానికి ప్రభుత్వం ఉత్తమ్ నేతృత్వంలో కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎర్రోళ్ల శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ అగ్రవర్ణానికి చెందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కమిటీ చైర్మన్‌గా నియమించడమంటే మరోసారి మాదిగలను దగా చేయడమేనని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గాల సమస్యలు తెలిసిన నాయకుడిని కాకుండా ఉన్నత వర్గానికి చెందిన ఉత్తమ్‌ని నియమించడంలో మీ ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉత్తమ్ వల్ల మాదిగ జాతికి ఎలా న్యాయం చేకూరుతుందని నిలదీశారు. ఈ కమిటీకి మంత్రి దామోదర రాజనర్సింహను చైర్మన్‌గా నియమించకపోవడం దారుణమని పేర్కొన్నారు. వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి దామోదర రాజనర్సింహను కమిటీ చైర్మన్‌గా నియమించాలని, లేదంటే కమిటీనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ మాదిగలను పట్టించుకోలేదని ఎర్రోళ్ల ధ్వజమెత్తారు. కాంగ్రెస్ విధానాలతోనే గతంలో సురేందర్ మాదిగ గాంధీభవన్‌లో అమరుడయ్యారని గుర్తు చేశారు.



### ఉత్తమ్ కమిటీని ఉపసంహరించుకోవాలి

- మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యాయం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 13 : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉత్తమ్ నేతృత్వంలోని కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బండి అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాటాడుతూ.. వర్గీకరణ అమలు కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కమిటీతో తెలంగాణలో మాలలకు ఏ మాత్రం న్యాయం జరగదని, ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. మంత్రు ల కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగిందని అన్నారు. ఈ కమిటీని రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌లో దళితులకు స్థానం లేదు

- పార్టీలో రెడ్డిలు, బీసీలకే పదవులు
- 40 ఏండ్లుగా పార్టీలో ఉన్నా..
- మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యం
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్శనాల సంటెన్న హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్శనాల సంటెన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 13: కాంగ్రెస్ పార్టీలో దళితులకు స్థానం లేదని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్శనాల సంటెన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. 'నేను ఓ దళిత బిడ్డను. 40 ఏండ్లుగా పార్టీలో పనిచేస్తున్న. నాకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వకపోతే కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ఆఫీస్ ముందట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంట' అని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక పార్టీ సీనియర్లకు నామినేటెడ్ పదవులు ఇస్తామని పలు సందర్భాల్లో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయంలో మంత్రులు, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ కాళ్లుపట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్ష రుణం తీసుకొని పార్టీ కోసం తిరిగానని, దళిత బిడ్డనైన తనకు న్యాయం చేయాలని కోరారు. గతంలో రెడ్డిలకు, బీసీలకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి స్పందించి మార్కెట్ కమిటీ పదవి ఇప్పించాలని, లేదంటే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు.

## బీసీ కులగణనపై సంప్రదింపులు

**బీసీ కమిషన్‌తో కమిషన్ పూర్వ సభ్యులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు శుక్రవారం కమిషన్ పూర్వ అధ్యక్షుడు, సభ్యులతో సమావేశమయ్యారు. బీసీ కులగణన, రిజర్వేషన్ అంశాలపై సంప్రదింపులు జరిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులకు తాము గతంలో సేకరించిన సమాచారాన్ని సమావేశంలో వ్యక్తపరచి ప్రస్తుత కమిషన్‌కు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తరుచూ సమావేశమై పరస్పర చర్చలు జరుపుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మితోపాటు పూర్వ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సభ్యులు డాక్టర్ ఆంజనేయగౌడ్, జూలూరి గౌరీశంకర్, సీహెచ్ ఉపేంద్ర, శుభప్రద్ పటేల్, కే కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై కేంద్రం స్పందించాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య**



హైదరాబాద్, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ) : బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ భవన్‌లో శుక్రవారం ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నేతలు భారీగా తరలివచ్చారు. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచుతూ పార్లమెంట్‌లో బిల్లును పెట్టాలని, లేకుంటే దేశంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీల అభివృద్ధి, హక్కుల కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, గోరిగె మల్లేశ్‌యాదవ్, గవ్వల భరత్, గుజ్జ సత్యం, లాల్‌కృష్ణ, నీల వెంకటేశ్, నంద గోపాల్, రాజేందర్, అనంతయ్య, కృష్ణ, కృష్ణుడు, పృథ్వీగౌడ్, రమాదేవి, లక్ష్మి, నిఖిల్ పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్, నాయకులు సాయి కుమార్

## బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

- చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలుచేయాలి
- మంత్రి పొన్నంకు బీసీ బహుజన సంక్షేమ సంఘం ప్రతినిధుల వినతి

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 13: బీసీలకు చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు అంశాలను పొందుపర్చిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్ గుర్తుచేశారు. బీసీ గణన చేపట్టి, రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు ఆకారపు మోహన్, నూతనకంటి ఆనందం, భిక్షపతి, పీ మల్లేశ్ ఉన్నారు.

## ప్రజాపాలన దినోత్సవానికి హాజరవ్వండి

**కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ ఆహ్వానం**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న 'తెలంగాణ ప్రజాపాలన' దినోత్సవ కార్యక్రమాలకు హాజరుకావాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి లేఖలు పంపారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

**సీఎం వెల్ఫేర్ ఫండ్‌కు విరాళాలు..**

ముఖ్యమంత్రి వెల్ఫేర్ ఫండ్‌కు డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీ రూ.5కోట్లు విరాళంగా అందించింది. వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్స్ రూ.కోటి, ఏఎంఆర్ ఇండియా రూ.కోటి, నటుడు నందమూరి బాలకృష్ణ రూ.50లక్షలు, వాక్సెన్ యూనివర్సిటీ రూ.50 లక్షలు అందజేశారు.

## వృద్ధులకు 5 లక్షల బీమా హర్షణీయం

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకంలో భాగంగా 70 ఏండ్లు దాటిన వయోవృద్ధులందరికీ రూ.5 లక్షల వరకు వైద్య బీమా అందించాలని కేంద్రం నిర్ణయించడం హర్షణీయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ 'వృద్ధుల సంక్షేమానికి ఓ కుటుంబ పెద్దగా, పెద్దకొడుకుగా ఆలోచించిన ప్రధాని మోదీ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ నుంచి దాదాపు 10 లక్షల మంది లబ్ధిపొందుతారు' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ట్రాన్స్‌జెండర్లకు క్లినిక్‌లు

**జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయం**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాకో క్లినిక్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారానికి రెండు లేదా మూడు రోజులపాటు వైద్యసేవలు అందించనున్నారు. జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ అందుబాటులో ఉండనున్నారు. అవసరాన్ని బట్టి గైనకాలజిస్ట్, యూరాలజిస్ట్ ఇతర స్పెషలిస్టుల సేవలు అందించనున్నారు. జెండర్ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయించనున్నట్టు తెలిసింది. ఉస్మానియా దవాఖానలోని ట్రాన్స్‌జెండర్ల క్లినిక్‌లో ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వైద్యారోగ్య, మహిళా సంక్షేమ శాఖలు సంయుక్తంగా వీటిని ఏర్పాటుచేయనున్నాయి. ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసినట్టు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. తాము అనారోగ్యం బారిన పడ్డప్పుడు దవాఖానలకు వెళ్లలేకపోతున్నామని, ధైర్యం చేసి వెళ్లినా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా క్లినిక్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## గ్రీన్‌పవర్ ఉత్పత్తికి ప్రణాళికలను సిద్ధం చేయండి

**రెడ్ కో, ఎస్పీడీసీఎల్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తేతెలంగాణ) : రాష్ట్రంలో గ్రీన్‌ఎనర్జీ(పునరుత్పాదక విద్యుత్తు)ని పెద్దఎత్తున ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని.. రైతుల వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వ ఖర్చులతో సోలార్ పవర్‌ను ఏర్పాటు చేయడంతో వచ్చే విద్యుత్తును పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు ఐదు నుంచి పది మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. తెలంగాణ రెడ్ కో వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీల, ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్‌అలీ పాల్గొన్నారు.

# వరద నష్టం 10,032 కోట్లు

- ఎన్డీఆర్ఎఫ్ నిధులున్నా వాడుకునే పరిస్థితి లేదు
- మున్నేరు రిటెయినింగ్ వాల్‌కు నిధులివ్వండి
- కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మల్లెలమడుగు వద్ద కొట్టుకుపోయిన ప్రధాన రహదారి (ఫైల్)

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో రూ.10,032 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉన్నదని చెప్పారు. వరద నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో సీఎం శుక్రవారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని కోరారు. వేలాది ఇండ్లు దెబ్బతిన్నాయని, లక్షలాది ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వివరించారు. ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. విపత్తు నిధుల వినియోగం విషయంలో కేంద్రం అమలు చేస్తున్న కఠిన నిబంధనలు సడలించాలని కోరారు. ఎన్డీఆర్ఎఫ్ నుంచి రూ.1,350 కోట్లు అందుబాటులో ఉన్నా నిబంధనల ప్రకారం ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకునే పరిస్థితి లేదని అధికారుల బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీఎం కోరారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజల కోసం సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఇండ్లను కేటాయిస్తామని, వాటి నిర్మాణాలకు అవసరమైన సాయం అందించాలని కోరారు. మేడారం అటవీ ప్రాంతంలో ఇటీవల దాదాపు 50 వేల ఎకరాల్లో చెట్లు నేలమట్టమైన ఘటనపై కేంద్ర నిపుణుల బృందంతో శాస్త్రీయ అధ్యయనం చేయించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, కేంద్ర బృంద సభ్యులు కల్నల్ కేపీ సింగ్, శాంతినాథ్ శివప్ప, మహేశ్‌కుమార్, నాయల్ కాన్సన్, రాకేశ్ మీనా, శశివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బృందానికి అందించిన నష్టం అంచనాలు

| విభాగం | నష్టం అంచనా (రూ.కోట్లలో) |
|---|---|
| మానవ మరణాలు | 1.40 |
| హౌసింగ్ | 25.30 |
| పశుసంవర్ధక | 4.35 |
| ఫిషరీస్ | 56.41 |
| వ్యవసాయం | 231.13 |
| ఆర్ అండ్ బీ, పీఆర్ | 7693.53 |
| విద్యుత్తు | 179.88 |
| పాఠశాలలు | 27.31 |
| నీటిపారుదల | 483.00 |
| తాగునీటి సరఫరా | 331.37 |
| పట్టణాభివృద్ధి | 1216.57 |
| ప్రభుత్వ భవనాలు, ఆస్తులు | 70.47 |
| మొత్తం | 10,320.72 |

## దెబ్బతిన్న 'సాగర్' గండ్లను పూడ్చాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): వరదలతో దెబ్బతిన్న నాగార్జున సాగర్ ఎడమకాలువ, చెరువులు, వాగుల గండ్లను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం ఏమంత రావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఈ నెల 3న కాలువలు, చెరువులకు గండ్లు పడటంతో పంటలు విపరీతంగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో సాగర్ నీళ్లు వస్తాయో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. పంట నష్ట పరిహారం కోసం రాష్ట్రానికి రూ.10వేల కోట్లు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న తుది జాబితా ప్రకటన
- జాబితా ఆధారంగానే స్థానిక ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు శుక్రవారం ప్రదర్శించారు. పంచాయతీ, మండల పరిషత్, మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచారు. ఈనెల 21వరకు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, 28న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. తుది జాబితా ఆధారంగానే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నట్టు పంచాయతీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముసాయిదా జాబితాను పరిశీలించుకోవాలని, గడువు ముగిసిన తర్వాత అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉండదని చెబుతున్నారు.



### జూరాల డ్యాం రోడ్డుపై మొసలి

వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని జూరాల ప్రాజెక్టు రోడ్డుపై శుక్రవారం ఉదయం మొసలి సంచరించింది. మత్స్యకారులు మొసలిని తాళ్లతో బంధించి ప్రాజెక్టులో వదిలిపెట్టారు. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుకు భారీగా వరద రావడంతో మొసళ్లు బయటకు వచ్చి సంచరిస్తున్నాయి.

– అమరచింత



### మల్కాపూర్ శివారులో చిరుత సంచారం

సారంగాపూర్, సెప్టెంబర్ 13 : నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామ శివారులో చిరుత సంచారం కొన్నిరోజులుగా కలకలం సృష్టిస్తున్నది. నెలరోజుల నుంచి ఇదే ప్రాంతంలో చిరుత సంచరిస్తుండటంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఓ రైతు తన పొలం నుంచి కూలీలతో కలిసి టిప్పర్‌లో శుక్రవారం వేకువజామున వస్తుండగా చిరుత కనిపించింది. గమనించిన కూలీలు తమ సెల్‌ఫోన్లలో చిరుత సంచరిస్తున్న దృశ్యాలు చిత్రీకరించి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు.

## మరో 500 కోట్ల అప్పు!

మొదటిపేజీ తరువాయి...

విలువైన బాండ్‌ను 12 ఏండ్లకాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కు జారీచేసింది. ఈ బాండ్‌ను ఈ నెల 17న ఆర్బీఐ వేలం వేయనున్నది. అనంతరం ఆ మొత్తం రాష్ట్ర ఖజానాకు చేరనున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.46,118 వేల కోట్ల అప్పు చేసింది. వచ్చే రూ.500 కోట్లతో కలిపి రాష్ట్ర రుణం 46,618 కోట్లకు చేరనుంది. ఈ నెలలో ఇప్పటికే 3వ తేదీన రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు.. ఇలా వారం రోజుల్లోనే రూ.4,000 కోట్లు రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ నెల 17న మరోసారి రూ.500 కోట్లు అప్పు తీసుకోనున్నది. ప్రతి నెలా రూ.5 వేల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది. అలవికాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుకు ఆపసోపాలు పడుతున్నది.

## 24 గంటల్లో మరో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : రానున్న 24గంటల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతున్నట్టు అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగ్నేయ బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగడంతో కోస్తా బంగ్లాదేశ్, ఉత్తర బంగాళాఖాతం ప్రాంతాలపై అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. 48 గంటల్లో పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ వాయుగుండంగా అల్పపీడనం బలపడుతుంది. పశ్చిమ బెంగాల్, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముంది. దీని ప్రభావంతో తెలంగాణ, కోస్తాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని.. మిగతా ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. బలమైన ఉపరితల గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీస్తాయని తెలిపింది.

**19 నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి**

నైరుతి రుతుపవనాలు ఈ నెల 19 నుంచి 25 మధ్య వెనక్కి మళ్లుతాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 17న తిరోగమనం మొదలై అక్టోబర్ 15 వరకు వెళ్లిపోతాయి.